సాక్షి నల్లగొండ

బుధవారం । 27 । ఆగస్టు । 2025



పవిత్ర మేడమ్ స్ఫూర్తితో..
పెన్‌పహాడ్ జెడ్పీహెచ్ఎస్ టీచర్ పవిత్ర చదువు చెప్పిన ఎంతో మంది ఆమె స్ఫూర్తితో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. - 10లో



విహారం కావొద్దు విషాదం
సాగర్ అందాలను చూసేందుకు వస్తున్న పర్యాటకులు, యువత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	585.90 అడుగులు
ఇన్‌ఫ్లో	:	1,61,971 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	1,61,971 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,739 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,387 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	8,807 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

● మట్టి గణపతిని పూజిద్దాం



మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ మంగళవారం నల్లగొండలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

● సిద్ధమైన లడ్డూ



నల్లగొండలో శివలింగం ఆకారంలో తయారు చేసిన లడ్డూ

● ముస్తాబైన మండపం



వినాయక చవితి సందర్భంగా విద్యుద్దీపాలతో ముస్తాబైన హోలియా 6వ వార్డులోని వినాయక మండపం

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం. 99123 62784

న్యూస్‌రీల్

మంత్రి కోమటిరెడ్డి శుభాకాంక్షలు

నల్లగొండ : రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా ఆనందోత్సాహాల నడుమ పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. గణేష్ నవరాత్రులు జరుపుకునే ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని కోరారు. గణేష్ మండపాల వద్ద పోలీసులు సూచనలు పాటించాలని కోరారు.

టైలరింగ్ కోర్సుకు దరఖాస్తులు

నల్లగొండ : నల్లగొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న టైలరింగ్ కోర్సుకు ఆసక్తి గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మేనేజర్ అనిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సు శిక్షణ 45 రోజులని, ఫీజు రూ.3 వేలు అని పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు పూర్తి వివరాలకు నల్లగొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం, 76600 22517 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉచిత న్యాయ సేవా క్లినిక్ ప్రారంభం

రామగిరి(నల్లగొండ) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నల్లగొండ సైనిక వెల్ఫేర్ కార్యాలయంలో మంగళవారం ఉచిత న్యాయ సేవా క్లినిక్‌ను జిల్లా జడ్జి ఎం.నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భద్రత కోసం సైనికులు చేసిన త్యాగం వెలకట్టలేనిదని మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఉచిత న్యాయ సహాయం అందించేందుకు ఈ క్లినిక్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ క్లినిక్‌లో వలంటరీ న్యాయవాది జి.శ్రీనివాస్ చక్రవర్తి, పారా లీగల్ వలంటీర్ శ్రీకాంత్ సేవలు అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి పి.పురుషోత్తంరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, కార్యదర్శి మంద నగేష్, కౌన్సిల్ మెంబర్ భీమార్జున్‌రెడ్డి, సైనిక వెల్ఫేర్ అధికారి టి.వనజ పాల్గొన్నారు.

ఏటీసీలో స్పాట్ అడ్మిషన్లు

నల్లగొండ : ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజి సెంటర్), ఐటీఐల్లో 2025–27 సంవత్సరంలో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జిల్లా ఐటీఐల కన్వీనర్ ఎ.నర్సింహాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 30లోగా http://iti.telangana.gov.inలో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయడంతో పాటు మొబైల్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ముగిసిన ఉపాధ్యాయ పదోన్నతుల ప్రక్రియ

నల్లగొండ : ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ మంగళవారం ముగిసింది. జిల్లాలో గెజిటెడ్ హెచ్ఎంల పదోన్నతుల ప్రక్రియను ఇటీవల పూర్తిచేసిన విషయం తెలిసిందే. సోమవారం ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించింది. జిల్లాలో 156 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు గాను 148 పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేశారు. వారంతా మంగళవారం విధుల్లో చేరారు. దీంతో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ముగిసింది.

70 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లాకు ఈ సీజన్‌లో సుమారు 70 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా.. ప్రభుత్వం ఇప్పటివరకు 48 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసింది. అందులో పీఏసీఎస్, ఆగ్రో సెంటర్లకు 28 వేల టన్నులు, ప్రైవేట్ డీలర్లకు 20వేల టన్నులు అలాట్ చేశారు. ఇంకా జిల్లాకు 22 వేల మెట్రిక్ టన్నుల అవసరం ఉంది. ప్రభుత్వం దశలవారీగా యూరియా సరఫరా చేస్తున్నా.. పంటల అదునుకు అందకపోవడంతో రైతులు పెద్ద ఎత్తున పీఏసీఎస్ సెంటర్ల వద్ద బారులుదీరుతున్నారని.. అవసరానికి మించి యూరియా వాడడం వల్ల కొరత ఏర్పడుతుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

మరణం ఏదైనా.. ఆర్థిక చేయూత

ఇంటి పెద్ద మరణిస్తే రూ.20 వేలు ఇవ్వనున్న ప్రభుత్వం

- జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద లబ్ధి
- జిల్లాలో 3500 మందికి ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం
- దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు ప్రయోజనం
- మరణించిన రెండేళ్లలో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు
- ఈనెల 30వ తేదీ వరకు గడువు
- ఇప్పటివరకు వచ్చింది 2070 దరఖాస్తులే..



తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఎన్ఎఫ్‌బీఎస్ పథకం దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన కుటుంబ పెద్ద మరణిస్తే కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుంది. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్) కింద కుటుంబ తక్షణ అవసరాల కోసం రూ.20 వేలు అందిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది జిల్లాలో 3,500 కుటుంబాలకు రూ.7 కోట్ల ఆర్థికసాయం అందించేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఈనెల 30వ తేదీలోగా కుటుంబ పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

ఎలా మరణించినా..

దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న పేద కుటుంబాల్లోని 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు వయస్సు కలిగిన కుటుంబ పెద్ద (మహిళ లేదా పురుషుడు) గడిచిన రెండేళ్లలో చనిపోయి ఉంటే ఈ పథకం కింద ప్రయోజనం కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. ప్రమాదవశాత్తు లేదా సహజంగా మరణించినా ఈ పథకం కింద లబ్ధి పొందవచ్చు. అంత్యోదయ అన్న బీమా యోజన, జన శ్రీ బీమా యోజన పథకాల కింద లబ్ధిపొందిన వారు ఈ పథకానికి అనర్హులు.

తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ

ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు దరఖాస్తులను సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో అందజేయవచ్చు. దరఖాస్తుతో పాటు మరణ ధ్రువీకరణ పత్రం, వ్యక్తిగత గుర్తింపు పత్రం, అడ్రస్ రుజువు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లు తెలిపే రేషన్‌కార్డు లేదా ధ్రువపత్రం జతచేయాలి. సహాయం పొందేందుకు దరఖాస్తు చేసిన కుటుంబ సభ్యులకు సంబంధించిన వ్యక్తిగత గుర్తింపు పత్రం, అడ్రస్, వయస్సు, కుటుంబ సభ్యుడి ధ్రువపత్రం, ఆధార్ కార్డు లింక్ చేసిన బ్యాంకు ఖాతా లేదా పోస్టాఫీస్ ఖాతా వివరాలతో పాటు, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫొటోను జత చేసి సమర్పించాల్సి ఉంటుంది.

గ్రామ కార్యదర్శులకు ఆదేశాలు

గ్రామాల్లో 2024 జనవరి ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు మరణించిన వారికి సంబంధించిన వివరాలను గ్రామ పంచాయతీల్లోని జనన, మరణ రిజిస్టర్ల ఆధారంగా వెంటనే ఎంపీడీఓలకు పంపించాలని గ్రామ కార్యదర్శులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఎంపీడీఓలు వాటిని పరిశీలించి, ఆ జాబితాలను తహసీల్దార్లకు అందజేయాలని స్పష్టం చేశారు. మున్సిపాలిటీల్లో మున్సిపల్ కమిషనర్లు ఆయా జాబితాను పంపించాలని వివరించారు.

పేదలు సద్వినియోగం చేసుకోవాలి



జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద లబ్ధి పొందేందుకు అర్హులైన పేద కుటుంబాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబాలకు చేయూత అందించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ సాయం ఆయా కుటుంబాల తమ ఇంటి అవసరాలకు ఉపయోగపడుతుంది.

– కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్

ఈ పథకం కింద జిల్లాలో మొత్తంగా 3,500 కుటుంబాలకు లబ్ధి చేకూర్చే అవకాశం ఉంది. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 2,070 కుటుంబాలకు చెందిన పేదలు దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధి చేకూర్చే వారి సంఖ్య కంటే దరఖాస్తులు చాలా తక్కువగా ఉన్నాయి. దీంతో ఈ పథకంపై కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలోని అర్హులైన నిరుపేదలు దరఖాస్తు చేసుకునేలా క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని, గ్రామ సమాఖ్య సంఘాలతోనూ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఏపీఎంలు, మండల ప్రత్యేక అధికారులు ఈ పథకంపై సమన్వయ సమావేశం నిర్వహించి, పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈనెల 30వ తేదీ వరకు వచ్చే దరఖాస్తులపై తహసీల్దార్లు పూర్తి విచారణ జరిపి, ఆర్డీఓలకు పంపించాలని, ఆర్డీఓలు ఆన్‌లైన్ ద్వారా డీఆర్‌ఓకు, తనకు పంపించాలని వివరించారు.

డిసెంబర్‌లోగా ట్యాంకుల నిర్మాణం పూర్తిచేయాలి

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరాకు చేపట్టిన ట్యాంకు నిర్మాణ పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నల్లగొండ మున్సిపల్ సమావేశ మందిరంలో తాగునీరు, రోడ్లు, మురుగుకాల్వలు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై మున్సిపల్, ప్రజారోగ్య ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమృత్ పథకం కింద రూ.56.75 కోట్లతో చేపట్టిన తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులు డిసెంబర్‌లోగా పూర్తిచేసి ప్రజలకు తాగునీరు అందించాలని ఆదేశించారు. రూ.109 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులను 3 నెలల్లో పూర్తి చేయాలన్నారు. పనుల పురోగతిపై ప్రతి మంగళవారం తాను సమీక్షిస్తానని తెలిపారు. అంతకుముందు మంత్రి మున్సిపాలిటీలోని ఆయా విభాగాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కందుకూరి వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాములు, డీఈలు కార్తీక్, అశోక్, శ్రీధర్‌రెడ్డి, ఏఈలు దిలీప్, ప్రవీణ్, అసింబాబా, ఏసీపీ కృష్ణవేణి పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధం!

- పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితా ఖరారుకు నోటిఫికేషన్
- షెడ్యూల్ జారీ చేసిన కలెక్టర్
- వచ్చే నెల 2న పోలింగ్ కేంద్రాలు, ఓటరు తుది జాబితా ప్రకటన



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : గ్రామ పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఎన్నికల నిర్వహణలో కీలకమైన పనులు వేగవంతం అయ్యాయి. ఓటర్ల జాబితాతోపాటు పోలింగ్ కేంద్రాలను ఖరారు చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేసింది. అందుకు అనుగుణంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు అసిస్టెంట్ జిల్లా ఎన్నికల అధికారులు, ఎంపీడీఓలకు ఆదేశాలు జారీ చేశారు. అయితే వార్డుల వారీగా కొత్త ఓటర్ల జాబితాలను గత నెలలోనే గ్రామ పంచాయతీ లాగిన్ ద్వారా రూపొందించారు. ఆ ప్రక్రియను ఇటీవలే పూర్తి చేశారు. ఇప్పుడు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ నేపథ్యంలో వాటిని మరొకసారి సరిచూసుకుని, వాటిపై అభ్యంతరాలు ఆహ్వానించి, వాటిని పరిష్కరించి తుది జాబితాలను ప్రకటించనున్నారు.

షెడ్యూల్ ఇలా..

ఈ నెల 28వ తేదీన గ్రామ పంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయాల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను నోటీసు బోర్డుల్లో పెడతారు. ఎంపీడీఓ కార్యాలయాల్లో వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రదర్శిస్తారు. 29వ తేదీన జిల్లా అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. 30వ తేదీన ఎంపీడీఓలు మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమవుతారు. 28 నుంచి 30వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 31వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి నేతృత్వంలో ఆ అభ్యంతరాలను పరిశీలించి, పరిష్కరిస్తారు. వచ్చే నెల 2వ తేదీన 868 గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల తుది జాబితాలను, వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల వివరాలను ఎన్నికల అధికారులు ప్రకటిస్తారు.

కాంగ్రెస్‌ది దుర్మార్గపు పాలన


● మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



రైతులతో మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం యూరియా కోసం లైన్లలో చెప్పులు పెట్టే దుర్మార్గపు పాలన తెచ్చిందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. మంగళవారం నార్కట్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్దకు రైతులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న చిరుమర్తి రైతుల సమస్యలను తెలుసుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మంత్రులు ఒక్కొక్కరు ఒక్కోలా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఒక మంత్రి యూరియా కొరత లేదని చెబుతుంటే, మరో మంత్రి నిల్వలు లేవని అంటున్నారని మండిపడ్డారు. రైతులు ఇన్ని ఇబ్బందులు ముఖ్యమంత్రి ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం దారుణమన్నారు. కేసీఆర్ హయాంలో యూరియా కొరత రాలేదని.. 24 గంటల కరెంట్ ఇచ్చి రైతులకు అండగా నిలిచిందన్నారు. ఇప్పుడు రైతులకు యూరియా సరఫరా చేయడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఇప్పటికైనా అధికారులు, మంత్రులు స్పందించి యూరియా తెప్పించి రైతులను ఆదుకోవాలన్నారు. ఆయన వెంట యానాల అశోక్‌రెడ్డి, దుబ్బాక శ్రీధర్, కర్నాటి ఉపేందర్ ఉన్నారు.

14 క్రస్ట్‌గేట్ల నుంచి వరద



నాగార్జునసాగర్ : సాగర్ జలాశయానికి వరద తగ్గుముఖం పడుతోంది. దీంతో వరుసగా గేట్లను మూసివేస్తున్నారు. 26 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 12 క్రస్‌గేట్లను మూసి వేశారు. ప్రస్తుతం 14 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 1,61,971 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం నుంచి దిగువ కృష్ణానదిలోకి స్పిల్‌వే మీదుగా 1,07,338 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 33,739 క్యూసెక్కులు మొత్తం 1,41,077 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

ఆధార్ కార్డుకు.. రెండు బస్తాలు



కొత్తపల్లి సొసైటీ వద్ద యూరియా కోసం ఉదయం నుంచే బారులుదీరిన రైతులు



లైన్‌లో చెప్పులు పెట్టిన రైతులు

హాలియా : యూరియా కష్టాలు తీరడం లేదు. ఉదయం నుంచే సొసైటీల వద్ద రైతులు క్యూ కడుతున్నారు. అనుముల మండలంలోని కొత్తపల్లి వ్యవసాయ సహకార సంఘానికి సోమవారం రాత్రి 444 బస్తాల యూరియా వచ్చింది. దీంతో మంగళవారం ఉదయం మండలంలోని పలు గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో సొసైటీ వద్దకు తరలివచ్చారు. గంటల తరబడి నిల్చోలేక చెప్పులను లైన్లలో పెట్టారు. దీంతో ఆధార్‌కార్డు ద్వారా ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. యూరియా అందని రైతులు నిరాశతో వెనుదిరిగారు.

ఏ పంట.. ఎంత విస్తీర్ణం

- పంటల నమోదు ప్రక్రియ ప్రారంభం
- క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న ఏఈఓలు



నల్లగొండ సమీపంలో పంటలను నమోదు చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారి

నల్లగొండ అగ్రికల్చర్ : పంటల సాగు లెక్క పక్కాగా ఉండేందుకు ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లాలో సాగు చేసిన పంటల వివరాలను జిల్లా వ్యవసాయ శాఖ సేకరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు ఆన్‌లైన్‌లో పంటల నమోదును ప్రారంభించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్లస్టర్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 7 గంటలకు వెళ్లి మధ్యాహ్నం 12 గంటల వరకు పంటల నమోదు ప్రక్రియను చేపట్టనున్నారు. రైతు పేరు, సర్వే నంబర్, బ్యాంకు ఖాతా నంబర్, పట్టాదారు పాస్ పుస్తకం, ఫోన్ నంబర్‌తో పాటు ఏఏ పంటలను ఎంత విస్తీర్ణంలో సాగు చేశారో తెలుసుకుని ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పంటల నమోదు కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. తప్పులకు ఆస్కారం లేకుండా పక్కాగా నమోదు చేస్తున్నారు. దీంతో జిల్లాలో వానాకాలం సీజన్‌లో రైతులు ఏఏ పంటలను ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారన్న సమాచారం పక్కాగా తేలనుంది.

9,90,502 ఎకరాల్లో సాగు..

ప్రస్తుత వానాకాలంలో 11,00,500 ఎకరాల్లో వివిధ పంటల సాగు కానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేయగా ఇప్పటి వరకు 9,90,502 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. అత్యధికంగా పత్తి 5,64,585 ఎకరాల్లో సాగు చేయగా వరి 4,44,932 ఎకరాల్లో వేశారు. వీటన్నింటిని వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో నమోదు చేయనున్నారు.

వివరాలను పంచాయతీల వద్ద ప్రదర్శిస్తాం



అక్టోబరు చివరి నాటికి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పంటల నమోదు పూర్తవుతుంది. నమోదు చేసిన వివరాలను ఆయా గ్రామ పంచాయతీ భవనాల వద్ద ఏఈఓలు ప్రదర్శిస్తారు. అందులో తప్పులు ఉంటే సరి చేసుకునే అవకాశం ఉంటుంది. నవంబరు 13వ తేదీ వరకు పక్కాగా జాబితా తయారవుతుంది.

– శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, నల్లగొండ

మండలాల వారీగా సాగు (ఎకరాల్లో)ఇలా..

మండలం	సాగువిస్తీర్ణం
అనుముల	25,819
గుర్రంపోడు	52,286
నిడమనూరు	21,214
పెద్దవూర	33,924
తిరుమలగిరిసాగర్	25,000
త్రిపురారం	20,416
చందంపేట	32,140
చింతపల్లి	43,778
దేవరకొండ	40,557
గుండ్లపల్లి	21,180
కొండమల్లేపల్లి	15,970
నేరడుగొమ్ము	15,748
పీఏపల్లి	24,258
గుండ్లపల్లి	17,261
అడవిదేవులపల్లి	10,555
దామరచర్ల	15,398
మాడ్గులపల్లి	41,102
మిర్యాలగూడ	31,308
వేములపల్లి	19,774
చండూరు	34,315
గట్టుప్పల్	14,878
మర్రిగూడ	26,009
మునుగోడు	44,434
నాంపల్లి	49,220
చిట్యాల	37,841
కట్టంగూర్	34,882
నకిరేకల్	23,413
నార్కట్‌పల్లి	42,466
శాలిగౌరారం	42,637
కనగల్	38,368
నల్లగొండ	55,360
తిప్పర్తి	34,990

క్లుప్తంగా

వాగులో కొట్టుకుపోయి వ్యక్తి మృతి


బాలరాజు (ఫైల్)

గుండాల: ప్రమాదవశాత్తు వాగులో కొట్టుకుపోయి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గుండాల మండలం అంబాల గ్రామ శివారులో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం రామచంద్రగూడెం గ్రామానికి చెందిన చిర్ర బాలరాజు(55) కొంతకాలంగా హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్‌లో ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడి భార్య గతంలోనే మృతిచెందింది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. బాలరాజు తన అత్తగారి ఊరైన ఆత్మకూరు(ఎం) మండలం పారుపల్లి గ్రామంలో మైసమ్మ పండుగకు హాజరయ్యేందుకు ఆదివారం హైదరాబాద్ నుంచి బస్సులో బయల్దేరి మోత్కూరులో దిగాడు. అక్కడి నుంచి పారుపల్లి గ్రామంలోని తన అత్తగారి వ్యవసాయ బావి వద్దకు వెళ్లేందుకు ఆత్మకూరు(ఎం) మండలం మోదుబావిగూడెం, గుండాల మండలం అంబాల గ్రామ శివారులోని బిక్కేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యాంపై నడుచుకుంటూ వెళ్తుండగా.. ప్రమాదవశాత్తు వాగులో జారిపడి కొట్టుకుపోయాడు. మంగళవారం అంబాల గ్రామ శివారులో బిక్కేరు వాగు ఒడ్డున బాలరాజు మృతదేహాన్ని స్థానిక రైతులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తేజమ్‌రెడ్డి తెలిపారు.

విహారం కావొద్దు విషాదం

- సాగర్ సందర్శనకు వచ్చేవారు అప్రమత్తంగా ఉండాలని సూచన
- జలాశయంలోకి దిగొద్దని హెచ్చరిక
- సూచిక బోర్డులు, ట్రంచ్‌ల ఏర్పాటు


సాగర్ జలాశయ తీరంలో యువత


దయ్యాలగండి పుష్కరఘాట్ వద్ద పర్యాటకులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతుండడంతో సాగర్ అందాలను చూసేందుకు పర్యాటకులు, యువత భారీగా తరలివస్తున్నారు. ఈ క్రమంలో కొందరు సాగర్ పరిసర ప్రాంతాల్లో, దయ్యాలగండి పుష్కర ఘాట్ వద్ద జలాశయంలోకి దిగడం వంటివి చేస్తున్నారు. అదేవిధంగా సెల్ఫీలు, ఫొటోలు తీసుకునే క్రమంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఒక్కసారిగా కాలు జారి నీటిలో పడితే బయటకు రావడం కష్టమని రక్షణ సిబ్బంది చెబుతున్నారు. గతంలో పలువురు యువకులు నీటిలో ఈత కొడుతూ, ఫొటోలు దిగుతూ ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఇటీవల సోషల్ మీడియాలో షార్ట్ వీడియోలు, సెల్ఫీలు ట్రెండ్ అవుతున్న నేపథ్యంలో యువత జలాశయం నీటిలో దూకుతూ, లోతైన ప్రదేశాల్లో ఈత కొడుతూ వీడియోలు తీసుకుని వాటిని సోషల్ మీడియాలో పెట్టడం ఫ్యాషన్‌గా మారింది. అనుకోని ఘటన జరిగితే ప్రాణాలనే ప్రమాదమని గుర్తించాలని స్థానికులు, అధికారులు సూచిస్తున్నారు.

అధికారుల ఏర్పాట్లు..

పర్యాటకుల భద్రత కోసం సాగర్ తీరం వెంట అధికారులు, పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దయ్యాలగండి వద్ద గల పుష్కర ఘాట్ వద్దకు వెళ్లకుండా రోడ్డు వెంట లోతైన ట్రంచ్ కొట్టారు. కొన్ని చోట్ల పోలీసులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేస్తున్నారు. అయినప్పటికీ కొందరు ఆ సూచనలను పట్టించుకోవడం లేదని అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తాం

నల్లగొండ టూటౌన్: ఎన్‌సీసీ శిక్షణ తరగతుల్లో క్రమశిక్షణ, దేశభక్తి సమ్మిళితమైన ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తామని కల్నల్ లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడేట్ల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో ప్రవేశానికి 60 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వారిలో ఎత్తు, బరువు, ఆరోగ్యం, రాత పరీక్షల ఆధారంగా ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేస్తామని తెలిపారు. ఇంజనీరింగ్ విద్య అభ్యసించే విద్యార్థులకు ఎన్‌సీసీ ద్వారా నేషనల్ డిఫెన్స్ అకాడమీ, అగ్నివీర్ లాంటి పథకాల్లో అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఇన్‌చార్జి డాక్టర్ మశ్చేందర్, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్.సుధారాణి, కొమ్ము మల్లయ్య, చంద్రవీర్, మాధవరావు పాల్గొన్నారు.


కల్నల్ లక్ష్మారెడ్డితో ఎంజీయూ విద్యార్థులు

కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు



మాట్లాడుతున్న ఈశ్వరరావు

కోదాడ: కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పకొట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. ఈశ్వరరావు కోరారు. మంగళవారం కోదాడలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చిందని, వీటి వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు అమ్ముతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా కార్మికులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 29న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ముందు జరిగే ధర్నాలను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, రాధాకృష్ణ, శ్రీలం శ్రీను, చెరుకు ఏకలక్ష్మి, సోమయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బొలేరో వాహనం ఢీకొని బాలిక మృతి


అక్షర (ఫైల్)

కొండమల్లేపల్లి: రోడ్డు దాటుతున్న బాలికను బొలేరో వాహనం ఢీకొనడంతో మృతి చెందింది. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతల్‌పహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాపూజీనగర్ వద్ద మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్‌ముంతలపహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాపూజీనగర్‌కి చెందిన పీట్ల రాజు, సంధ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. రాజు కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటూ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వినాయక చవితి పండుగ సందర్భంగా సోమవారం కుటుంబంతో కలిసి రాజు స్వగ్రామం బాపూజీనగర్‌కు వచ్చాడు. మంగళవారం ఉదయం రాజు కుమార్తె అక్షర(4) తన నానయమ్మ సుగుణమ్మతో కలిసి బాపూజీనగర్‌లో రోడ్డు దాటుతుండగా.. దేవరకొండ నుంచి కొండమల్లేపల్లి వైపు వేగంగా వస్తున్న బొలేరో వాహనం అక్షరను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అక్షరను చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

బ్యాంకులో వ్యక్తి నుంచి నగదు చోరీ

నకిరేకల్: బ్యాంకులో గోల్డ్ లోన్ చెల్లించేందుకు వచ్చిన వ్యక్తి నుంచి గుర్తుతెలియని మహిళలు డబ్బులు చోరీ చేశారు. ఈ ఘటన నకిరేకల్‌లోని సహకార కోపరేటివ్ బ్యాంక్‌లో సోమవారం మధ్యాహ్నం జరిగింది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం నడిగూడెం గ్రామానికి చెందిన నాగరాజు నకిరేకల్‌లోని కోపరేటివ్ సహకార బ్యాంక్‌లో గోల్డ్ లోన్ తీసుకున్నాడు. లోన్ చెల్లించేందుకు సోమవారం మధ్యాహ్నం బ్యాంక్‌కు వచ్చాడు. రూ.3లక్షలు బ్యాంకు కౌంటర్‌లో చెల్లిస్తుండగా గుర్తుతెలియని మహిళలు అతని చుట్టూ చేరారు. ఈ క్రమంలో నాగరాజుకు ఫోన్ రావడంతో పక్కకు జరిగి ఫోన్ మాట్లాడుతున్నాడు. ఇది గమనించిన నలుగురు మహిళలు కౌంటర్ దగ్గర నాగరాజుకు చెందిన రూ2.50లక్షల అపహరించి పరారయ్యారు. బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

మేకలు అపహరిస్తున్న ముఠా అరెస్ట్

- రూ.2.46లక్షల నగదు, 22 గొర్రెలు, 8 కార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, పోలీస్ అధికారులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

నల్లగొండ: కార్లలో మేకలు అపహరిస్తున్న 16 మంది ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సోమవారం రాత్రి శాలిగౌరారం సమీపంలోని బైరవోని బండ ఎక్స్ రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. అటుగా కారులో వచ్చిన వారు తప్పించుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు కారును వెంబడించి పట్టుకున్నారు. కారులో అనుముల మండలం అలీనగర్‌కు చెందిన సంపంగి వెంకటేష్, సంపంగి శారద, మునుగోడు మండలం గూడపూర్‌కు చెందిన వేంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నిడమనూరుకు చెందిన దాసర్ల వినోద్‌కుమార్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారి ఫింగర్ ప్రింట్స్ స్కాన్ చేయగా వారిపై గతంలో మేకలు చోరీ చేసిన కేసు ఉన్నట్లు తేలింది. పట్టుబడిన నలుగురిని విచారించి.. వారితో పాటు మేకలు చోరీ చేస్తున్న మర్రిగూడ మండలం శివన్నగూడేనికి చెందిన వరికుప్పల రవి, రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన గండికోట శివకుమార్, ఏపీలోని పల్నాడు జిల్లా గురజాల మండలం ఎస్సీ కాలనీకి చెందిన అమ్ములూరి విజయ్, హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన లింగాల అశోక్, ఉండం కళ్యాణి, భువనగిరి హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన వల్లెపు ప్రసాద్, మహబూబ్‌నగర్ జిల్లా బాలనగర్ మండలం పెద్దాయిపల్లికి చెందిన మద్యాల సహదేవ్, సూర్యాపేట జిల్లా మోతెకు చెందిన కోడిసె వంశీకృష్ణ, కంపాటి హుస్సేన్, కంపాటి అజయ్‌కుమార్, మట్టి సురేష్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. వీరంతా కలిసి నాలుగు ముఠాలుగా ఏర్పడి కార్లలో పగటిపూట రెక్కీ నిర్వహించి రాత్రి వేళ మేకలను కార్లలో వేసుకొని చోరీలకు పాల్పడుతున్నారని ఎస్పీ తెలిపారు. వీరు నల్లగొండ జిల్లాలో 15 చోట్ల, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలో 10 చోట్ల మేకలు అపహరించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. దొంగిలించిన మేకలను సంతలలో గుర్తుతెలియని వ్యక్తులకు అమ్మి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారని ఎస్పీ వివరించారు. వారి నుంచి రూ.2.46లక్షల నగదు, 22 గొర్రెలు, 8 కార్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముఠాలోని కోటేష్, కనుకుల బేబీ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో నిందితులను పట్టుకున్న నల్లగొండ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్‌రెడ్డి, ఎం. నాగభూషణ్, కె. కొండల్‌రెడ్డి, శాలిగౌరారం ఎస్ఐ, నార్కట్‌పల్లి సీఐ, పోలీస్ సిబ్బంది, సీసీఎస్ సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి రివార్డు ప్రకటించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీకి యత్నం

మునుగోడు: మునుగోడు మండలం చొల్లేడు గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్ల గూడెంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మద్ది మల్లేష్ సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి వ్యవసాయ పనులకు వెళ్లగా.. మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి చోరీకి యత్నించారు. కానీ ఇంట్లోకి వెళ్లకుండానే తిరిగి వెళ్లిపోయారు. మల్లేష్ కుటుంబ సభ్యులు తిరిగి ఇంటి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు మల్లేష్ తెలిపాడు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

మోతె: మోతె మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండల కేంద్రానికి చెందిన యువకుడు, తన స్నేహితులతో కలిసి భద్రాచలం, ఒరిస్సా ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసి మోతె మండలానికి తీసుకొస్తుండగా.. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ అజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని రత్నాలకుంట ఇద్దరిని పట్టుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన నిందితుల నుంచి 1.200 కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పవిత్ర మేడమ్ స్ఫూర్తితో..


విద్యార్థులకు కార్డ్ గేమ్స్, బోర్డు గేమ్స్ గురించి వివరిస్తున్న ఉపాధ్యాయురాలు పవిత్ర


డిజిటల్ పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు పవిత్ర

- టీచర్లు, లెక్చరర్లుగా పలువురి ఎంపిక
- జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లలో పాల్గొని సత్తాచాటుతున్న విద్యార్థులు

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మారం పవిత్ర జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు ఎంపికయ్యారు. మారం పవిత్ర స్ఫూర్తితో ఆమె చదువు చెప్పిన ఎంతో మంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఆమె కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా.. తమలోని భయాలను తొలగించేందుకు కృషిచేసేదని, చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు వారిలోని ఇతర ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేదని విద్యార్థులు చెబుతున్నారు.

జిల్లాస్థాయిలో గుర్తింపు లభించింది



పవిత్ర గైడెన్స్‌లో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో వీడర్ అండ్ సీడర్ ప్రాజెక్టు ప్రదర్శించడంతో జిల్లా స్థాయిలో గుర్తింపు వచ్చింది. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం సంతోషంగా ఉంది.

– బి. శ్రీకాంత్, 10వ తరగతి, పెన్‌పహాడ్ జెడ్పీహెచ్ఎస్

సంతోషంగా ఉంది



ఆంధ్ర, తెలంగాణ అగస్త్య జిజ్ఞాస పోటీల్లో మొదటి బహుమతి రావడం సంతోషంగా ఉంది. ఈ అవార్డుతో పాటు రూ.1500 ప్రైజ్‌మనీ పొందాను. జీవశాస్త్ర టీచర్ పవిత్ర మేడమ్ నన్ను ఎంతగానో ప్రోత్సహించింది.

– ఎం. మేఘన 10వ తరగతి, పెన్‌పహాడ్ జెడ్పీహెచ్ఎస్

జిల్లా సైన్స్ ఫెయిర్‌లో అవార్డు దక్కింది



నేను తయారు చేసిన క్రాప్ ప్రొటెక్టర్ ఆఫ్ అన్‌సీజనల్ రెయిన్స్ ప్రాజెక్టుకు జిల్లా సైన్స్‌ఫెయిర్‌లో అవార్డు దక్కడం ఆనందంగా ఉంది.

– శ్వేత 10వ తరగతి, పెన్‌పహాడ్ జెడ్పీహెచ్ఎస్

బోధన తీరుతో స్ఫూర్తి పొందా..



సూర్యాపేటలోని ఎంఎస్ఆర్ బీఈడీ కళాశాలలో చదువుతున్నప్పుడు పవిత్ర మేడమ్ ప్రైవేట్ లెక్చరర్‌గా మాకు పాఠాలు బోధించేది. ఆమె బోధనా తీరు, ప్రేరణతో జీవితంలో ఉన్నతస్థాయికి చేరాలనే లక్ష్యంతో కష్టపడి చదివి ఉద్యోగం టీచర్ ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం చందూరు మండలం దానుపాముల జెడ్పీహెచ్‌ఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను.

– రాసమళ్ల సికిందర్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, దానుపాముల, చందూరు

స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యా..



నేను గరిడేపల్లి మండలం గడ్డిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదువుతున్నాను. పవిత్ర టీచర్ ఇచ్చిన శిక్షణతోనే నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాను. ప్రస్తుతం ప్రతి సంవత్సరం అకౌంట్‌లో రూ.12వేలు జమవుతున్నాయి. విద్యాభ్యాసం కోసం స్కాలర్‌షిప్ ఎంతగానో దోహదపడుతుంది.

– ఎ. వైష్ణవి, 10వ తరగతి, గడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్

ప్రాక్టికల్ విధానంలో బోధన చూసి..



మద్దిరాల మండలం గోరంట్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉన్నప్పుడు పవిత్ర టీచర్ ప్రాక్టికల్ విధానంలో సైన్స్ బోధించడం చూసి.. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ఇస్రోలో టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం హైదరాబాద్‌లోని కులీ కుతుబ్‌షా పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. విద్యార్థులతో ఎలా ఉండాలనే విషయాన్ని పవిత్ర టీచర్ నుంచే నేర్చుకున్నాను.

– ప్రవీణ్‌కుమార్, పాలిటెక్నికల్ లెక్చరర్